క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం సబ్‌స్టేషన్‌లో ఉన్న 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎడ్యుక్యూటివ్ ఇంజినీర్ జి. ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా వేట్లపాలెం, హుస్సేన్‌పురం, వేట్లపాలెం ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు


పూజలందుకున్న మరిడమ్మ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

27న పెద్దాపురం మండల సమావేశం

పెద్దాపురం: మండల పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్టు పెద్దాపురం ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరుగుతుందన్నారు. మండలంలోని అన్నీ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

14న హనుమాన్ శోభాయాత్ర ర్యాలీ

సామర్లకోట: హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మే 14వ తేదీన భారీ ఎత్తున హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కర్రి ఆదినారాయణరెడ్డి, పి.ప్రభాకర్, ఎం.వీరబాబు, జీవీకె మోహన్‌రావు తెలిపారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి భారీ ఎత్తున మోటారు సైకిళ్లతో ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. ర్యాలీలో పాల్గొనడానికి ఆసక్తి కలిగినవారు 94938 39665 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గుడివాడ వజ్రకాలువ ఆక్రమణ తొలగింపు


వజ్ర కాలువలో ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పెద్దాపురం: మండలంలోని గుడివాడ వజ్ర కాలువ ఆక్రమణలను తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి ఎ.భారతి తెలిపారు. వజ్ర కాలువ ఆక్రమణలపై నెక్కంటి రామారావు లోకాయుక్తాకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో లోకాయుక్త ఆదేశాల మేరకు శుక్రవారం వజ్ర కాలువలో పరిధిలో ఆక్రమణలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లు, సిమెంట్ ర్యాంప్‌లను తొలగించారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: ప్రభుత్వం మత్స్యకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విష్ణు హాస్పటల్ అధినేత, జనసేన పార్టీ నాయకుడు పిల్లా శ్రీధర్ డిమాండ్ చేశారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పొన్నాడ శివారు రామన్నపాలెం ఉప్పటేరు వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే మత్స్యకార భరోసాను రూ.30 వేలకు, ఆయిల్ సబ్సిడీని 300 లీటర్ల నుంచి 3 వేల లీటర్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంక కొండబాబు, పల్లెటి బాపన్నదొర, రాంశెట్టి రాంబాబు, మైలపల్లి రాజు, బొంతుల వెంకటరావు, గనగా సత్యానందం, దుద్దు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేటు పెరిగిన తాటి ముంజెలు

- డజను రూ.50 చొప్పున అమ్మకం
- క్రమంగా కనుమరుగవుతున్న చెట్లు


తాటి ముంజెలు తీస్తున్న అమ్మకందారుడు


పొలాల్లోని గట్లపై అక్కడక్కడా కనిపిస్తున్న తాటిచెట్లు

సామర్లకోట: ఆయా సీజన్లలో ప్రకృతి అనేక పండ్లను అందుబాటులోకి తెస్తుంది. వేసవి కాలం ప్రారంభం కాగానే తాటి ముంజెలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. 20 ఏళ్ల క్రితం వరకు గ్రామీణ ప్రాంతంలో రైతులు వేసవి కాలం సెలవులు రాగానే పిల్లలను పొలాల్లోకి తీసుకువెళ్లి కడుపు నిండా తాటి ముంజెలు తినిపించేవారు. చివరిలో ఒక మామిడికాయ తింటే ఎన్ని తాటి ముంజెలైనా జీర్ణం చేసుకోవచ్చని అంటారు. అయితే నేడు తాటి చెట్లు కనిపించక పోవడంతో పాటు తాటి చెట్లు ఎక్కేవారు కనుమరుగై పోయారు. దాంతో రైతులు కూడా తాటి ముంజెలను కొనుగోలు చేయాల్సి వస్తోంది.

మెట్ట ప్రాంతంలో ఎక్కువగా తాటి చెట్లు ఉంటాయి. అయితే పొలాలన్నీ లేఅవుట్లుగా మారడంతో తాటి చెట్లు కనుమరుగైపోతున్నాయి. దాంతో తాటి ముంజెలు సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ముంజెలు తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని డాక్టర్లు చెబుతున్నారు. గత ఏడాది 12 ముంజెలు రూ.30 ఉండగా ప్రస్తుతం 12 ముంజెలు రూ.50కి విక్రయిస్తున్నారు. తెల్లవారు జామునే సుమారు 20 కిలోమీటర్ల దూరం వెళ్లి 10 చెట్లు ఎక్కితే 100 ముంజెకాయలు దింపడం కష్టం అవుతుందని, తాటి ముంజెల అమ్మకం దారులు అంటున్నారు. మరో కొన్ని ఏళ్లు గడిస్తే తాటి ముంజెలు అంటే ఏమిటో తెలియని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెట్లు ఎక్కేవారు లేరు

పొలాల్లో సరిహద్దుల గట్లపై మాత్రమే అక్కడక్కడా తాటిచెట్లు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో అవీ కనిపించే అవకాశం లేదు. నా పొలంలో చెట్లు ఉన్నా ఎక్కేవారు లేకపోవడంతో ముంజెలు కొనుగోలు చేసుకోవలసి వస్తోంది.

– పుట్టా సోమన్న చౌదరి, రైతు, మర్రిపూడి



ఎంతో మేలు

తాటి చెట్టు నుంచి వచ్చే ముంజెకాయలు, తాటిపండ్లు, బుర్రగుంజు, తేగలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవి కాలంలో తాటి ముంజెలు తినడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. తాటి పండ్ల నుంచి బూరెలు, తాండ్ర తయారు చేసుకోవచ్చు. అవి ఎంతో రుచిగా ఉంటాయి. తాటిటెంకల నుంచి తీసిన బుర్రగుంజు ఎంతో మేలు చేస్తుంది. ఇక తేగలు జీర్ణశక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

– డాక్టరు లక్ష్మి, పెద్దాపురం



వేగంగా ఇళ్ల నిర్మాణాలు


సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

సామర్లకోట: మండల పరిధిలో మొదటి ఫేజ్‌లో మంజూరు అయిన ఇళ్లను వేగంగా పూర్తి చేయాలని కాకినాడ డీఎల్‌డీఓ పి. నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ అడ్మిన్‌లతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. జి. మేడపాడు, వేట్లపాలెం, పవర లేఅవుట్‌లలో టార్గెట్‌లను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు మహిళ పేరున మంజూరు కావడం తో బ్యాంకులు ప్రతీ మహిళకు రూ.35వేలు రుణం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయనే విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. అదే విధంగా నాడు–నేడు పనులకు సంబంధించి పాఠశాలలు తెరిచే నాటికి పనులు పూర్తి చేయాలని ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత, మండల ఇంజినీరింగ్ అధికారి కె.మణిమాల, హౌసింగ్ ఎఈ వెంకటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


తమ్మయ్యపేటలో తాగునీటి సమస్యపై అధికారులతో చర్చిస్తున్న జేఈ సంధ్య

కొత్తపల్లి: ప్రస్తుత వేసవిలో తాగునీరు ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ సంధ్య తెలిపారు. మండలంలోని అమరవిల్లి శివారు తమ్మయ్యపేటలో శుక్రవారం ఆమె పర్యటించారు. గ్రామంలో తాగునీరు సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నామని, దీంతో శివారు ప్రాంతాలకు తాగునీరు సమస్య ఏర్పడుతుందన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా వాటర్ ట్యాంకులను నిర్మిస్తునట్టు తెలిపారు. గ్రామాల్లో పబ్లిక్ కుళాయిల ట్యాప్‌లను ఎవరూ తొలగించరాదన్నారు. కుళాయిలకు మోటార్లను బిగించడం వలన తాగునీటి సమస్య తలెత్తుతోందని, దీనిపై పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి జయబాబు, ఎంపీడీఓ అబ్రహం లింకన్, పంచాయతీ కార్యదర్శి అహ్మద్‌వలీ పాల్గొన్నారు.

పిఠాపురం చరిత్ర పుస్తకావిష్కరణ


పిఠాపురం చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పిఠాపురం: కవి, రచయిత ర్యాలి ప్రసాద్ రచించిన పిఠాపురం చరిత్ర పుస్తకాన్ని శుక్రవారం రాత్రి స్థానిక ఆదిత్య స్కూల్ ప్రాంగణంలో ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం మహారాజా కుమారుడు రాజా రావురత్నారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, బాదం దుయ్ సూర్యప్రకాష్, కాదులూరి వెంకట్రావురెడ్డి, శ్రీపాద లక్ష్మణరావు, గట్టి శ్రీకృష్ణదేవరాయలు, అల్లవరపు నగేష్, కొండేపూడి ప్రకాష్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై పిఠాపురం ఘన చరితను వివరించారు. అనంతరం రచయిత ర్యాలి ప్రసాద్ తండ్రి ర్యాలి వెంకట్రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

సారూ.. ఇదేం తీరు

- విద్యార్థులతో ఇంటిపనులు చేయిస్తున్న ఉపాధ్యాయుడు
- ఆందోళన చేపట్టిన తల్లిదండ్రులు
- విచారిస్తున్న అధికారులు


పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పోలీసులు, అధికారులు


పాఠశాలలో తల్లిదండ్రులను విచారణ చేస్తున్న ఎంఈఓ నాయిక్

జగ్గంపేట: గ్రామ శివారు సీతానగరంలో 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులతో ఇంటి పనులు చేయిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరం గ్రామంలోని ప్రైమరీ స్కూల్‌లో ఎంజే ఆనందబాబు గత ఏడు సంవత్సరాలుగా హెచ్‌ఎంగా పనిచేస్తున్నాడు. ఆయన ప్రవర్తన గత కొంతకాలంగా విచిత్రంగా కనిపిస్తోందని గ్రామస్తులు ఆరోపిసున్నారు. నగరం గ్రామంలో పనిచేస్తున్న ఆనందబాబు నాలుగు కిలోమీటర్ల దూరంలోని కాట్రావులపల్లిలో నివాసం ఉంటున్నారు. ఆయన గత కొంత కాలంగా 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను రోజుకు ఇద్దరు చొప్పున ఇంటికి తీసుకువెళ్లి ఇల్లు తుడవడం, మొక్కలకు నీళ్ల పోయడం, బూజులు దులపడం, గిన్నెలు తోవడం లాంటి పనులు చేయించుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు ఇప్పటివరకూ ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పకపోవడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. విద్యార్థులు నగరం గ్రామం నుంచి కాట్రావులపల్లి వెళుతున్నారనే విషయం తల్లిదండ్రలకు తెలిసి పిల్లలను గట్టిగా అడగడంతో మాస్టార్ చేస్తున్న నిర్వాకం బయటపడింది. దీంతో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు తక్షణమే ఉపాధ్యాయుడు ఆనందబాబుపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. విషయం తెలిసిన వెంటనే జగ్గంపేట ఎంపీపీఓ హరికృష్ణ విచారణకు ఆదేశించడంతో ఇన్‌చార్జీ ఎంఈఓ కేహెచ్ నాయక్ విచారణ చేపట్టారు. 16 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను విచారించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్, గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా, వైఎస్సార్ సీపీ నేత కరుటూరి రాజు, ఈటీపీఆర్డీ భారతి అక్కడకి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. విచారణ నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి పంపిస్తామని ఎంఈఓ నాయక్ తెలిపారు. కాగా విద్యార్థులు తన ఇల్లు చూస్తానంటే కాట్రావులపల్లి తీసుకువెళ్లినట్లు ఉపాధ్యాయుడు ఆనందబాబు చెబుతున్నారు.

ఇబ్బడి ముబ్బడిగా కొబ్బరి మామిడి!


ఉప్పరగూడెంలో విరగకాసిన కొత్తపల్లి కొబ్బరి మామిడి చెట్టు

కొత్తపల్లి: మండలంలోని పాత ఇసుకపల్లి శివారు ఉప్పరగూడెంలోని గుల్లపల్లి వెంకటేష్ స్వగృహం వద్ద కొత్తపల్లి కొబ్బరి మామిడిచెట్టు విరగకాసింది. చెట్టు మొత్తం గుత్తుల గుత్తుల కాయలతో ఆకట్టుకుంటుంది. చెట్టుకు ఉన్న కొమ్మలు కాయల బరువుతో ఒంగిపోయాయి. ఈ మొక్కను నాటి 3 సంవత్సరాలు అయ్యిందని, గత సంవత్సరం కూడా కాయలు కాసిందని వెంకటేష్ కుటుంబ సభ్యులు తెలిపారు. గుత్తులుగా ఉన్న మామిడి కాయలను చూసేందుకు స్థానికులు పోటీ పడుతున్నారు. కాగా మామిడి కాయల్లో రారాజుగా పిలిచే కొత్తపల్లి కొబ్బరి మామిడి పండ్లకు ఎంతో గిరాకీ ఉంది.

దొంగలుంటారు జాగ్రత్త

కాకినాడ రూరల్: వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ కోరారు. మండలంలోని రమణయ్యపేట గ్రామ పరిధిలోని రాయుడుపాలెం శేషాద్రినగర్‌లో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం రవి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా దొంగతనాలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ రాయుడుపాలెం, శేషాద్రినగర్ ప్రాంతాలలో వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరైనా వేసవిలో ఇతర ప్రాంతాలకు వెళ్ల వల్సి వస్తే ఇంటికి తాళాలు వేయడంతో పాటు పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా నిఘా ఉంచుతామన్నారు. ముఖ్యంగా పిల్లలకు వేసవి సెలవులు అని చాలామంది ఊళ్లు వెళుతుంటారని అటువంటి వారు బంగారు ఆభరణాలు, నగదు ఇండ్లలో ఉంచవద్దన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సచివాలయం మహిళా పోలీసు ఫర్జానా లాక్ హౌస్ మానిటరింగ్ ఏ విధంగా చేపడతారో వివరించారు. లింగం రవి మాట్లాడుతూ వేసవిలో అనుమానిత వ్యక్తులు సంచారం ఎక్కువగా ఉంటుందని, వారిపై నిఘా ఉంచాలన్నారు. రాత్రి పూట అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసరావు, సాయికుమార్, బాల కనక దుర్గమ్మ ఆలయ కమిటీ అధ్యక్షురాలు మీనవల్లి తలుపులమ్మ, రిటైర్డ్ పోలీసుల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చక్రధరరావు, కాలనీ ప్రెసిడెంట్ వరప్రసాద్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఫై డే

- నిప్పులు చెరుగుతున్న భానుడు
- 40 డిగ్రీలు దాటుతున్న పగటిపూట ఉష్ణోగ్రతలు
- అల్లాడుతున్న ప్రజలు


నిర్మానుష్యంగా మారిన ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు

కొత్తపల్లి: పది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. పిఠాపురం నియోజకవర్గాల్లో 40 డిగ్రీలకు పైబడి పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వేసవి తాపానికి ఉక్కబోత తోడవడంతో బయట సంచరించే వారితో పాటు ఇళ్లలోని వారు సైతం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగింది. అధిక ఉష్ణోగ్రతలతో పాటు ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. ఎండతాపం నుంచి రక్షించుకునేందుకు ప్రజలు చల్లని పానియాల దుకాణాలను ఆశ్రయిస్తుంచారు. పండ్ల రసాలు, కొబ్బరి బొండాల దుకాణాలు కిటకిటలాడాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు అనేక మంది సముద్ర తీరానికి చేరుకున్నారు. పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా కెరటాల్లో కేరింతలు కొడుతూ సాగర తీరంలో సేద దీరారు.

నిర్మానుష్యంగా మారిన రహదారులు

ఎండకు భయపడి ప్రజలు అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రధాన కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండ వేడిని తట్టుకోలేక రోడ్లపై ప్రయాణించే వాహనదారులు రోడ్లకు ఇరువైపులా చెట్ల కింద వాహనాలను నిలిపివేశారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి వాటిని వినియోగించారు.

తీరంలో సందడి

రోజురోజుకూ ఎండల తీవ్రత పెరగడంతో ఉపశమనం కోసం పర్యాటకులు అధికసంఖ్యలో తీర ప్రాంతానికి చేరుకుంటున్నారు. దీంతో ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ ఉన్న తీర ప్రాంతం సందర్శకులకు కళకళలాడుతోంది. కాగా తీర ప్రాంతం వెంబడి నిలువ నీడ లేకపోవడంతో పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పర్యాటక కేంద్రంగా మారుతున్న ఉప్పాడ తీరానికి జిల్లా నలుమూలల నుంచి ప్రతినిత్యం పర్యాటకులు వస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున గాలిలో తేమ శాతం తగ్గుతోంది. ప్రస్తుత వేసవిలో చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవటం ద్వారా డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. ప్రతిఒక్కరూ నిత్యం 4 నుంచి 5 లీటర్ల నీటిని తాగాలి. కొబ్బరి బొండాలు, పండ్ల రసాలు, మజ్జిగ ఎక్కువగా తీసుకుంటే మంచిది. ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలను ఆడుకోవడానికి పంపకూడదు.

– మౌనిక, వైద్యాధికారి, కొత్తపల్లి పీహెచ్‌సీ

ఐదు శాతం రిబేట్‌ను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

సామర్లకోట: మున్సిపాలిటీకి చెల్లించవలసిన ఆస్తి, తాగునీరు, ఖాళీ స్థలం పన్నులను ఈ నెల 30వ తేదీ లోపుగా చెల్లించి 5 శాతం రిబేట్ పొందాలని కమిషనర్ సీఎంఎ నయీం అహ్మద్ అన్నారు. శుక్రవారం కమిషనర్ చాంబరులో సచివాలయ అడ్మిన్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ వరకు పన్ను రిబేట్ ఇచ్చిందన్నారు. గతంలో మార్చి 31 వరకు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం మరో ఒక నెల అదనంగా ఇచ్చామన్నారు. దీనిపై ఆయా వార్డులలోని ప్రజలకు అవగాహన పెంచాలని సూచించారు. ప్రతీ ఇంటికి వెళ్లి రిబేట్‌పై అవగాహన కల్పించి, వారు సద్వినియోగం చేసుకునే విధంగా చూడవలసిన బాధ్యత సచివాలయ అడ్మిన్‌లపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి పూడి రవిబాబు, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పిఠాపురంలో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన శృంగేరిశంకర మఠం శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పండితులు అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 25 వరకూ ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మంత్రి అప్పలరాజుకు వినతి


మంత్రి అప్పలరాజును కలసిన సంఘం అధ్యక్షుడు పరశురాం, కార్యవర్గ సభ్యులు

బాలాజీచెరువు: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పశు, మత్స్యశాఖామంత్రి సిదిరి అప్పలరాజును శుక్రవారం కాకినాడ జిల్లాపరిషత్‌లో జిల్లా మత్స్య సహాయకుల సంఘం అధ్యక్షుడు చాగంటి పరశురాం ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కలిశారు. 2019 ఎమెండ్‌మెంట్స్ ప్రకారం ప్రమోషన్ ప్యానల్‌లో మత్స్య సహాయకులకు అర్హత కల్పించాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందించి మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబుకు తెలియజేస్తానన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీవీ సత్యనారాయణ, మణికంఠ, రాహుల్, చిరుహాస్, సురేష్, శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కరప: ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు చైతన్య గోదావరి గ్రామీణబ్యాంక్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జనసురక్ష ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ అన్నారు. నడకుదురులో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జనధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ఇతర బ్యాంక్ కార్యాకలాపాలు వివరించారు.